ప్రజాశక్తి
మంగళవారం 8 ఆగస్టు 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





హింస అధ్యయనానికి కమిషన్ వేయాలి

- ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ
- ఐద్వా పోరుయాత్రలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి
- పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పర్యటించిన యాత్రకు ఘన స్వాగతం



బృందానికి గుంటూరులో స్వాగతం పలుకుతున్న మహిళలు

ప్రజాశక్తి-గుంటూరు

మహిళలు, చిన్నారులపై హింసను అరికట్టటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. రాష్ట్రంలో రోజురోజుకీ మహిళలపై పెరుగుతున్న దాడులు, హింసను అధ్యయనం చేసి, నివారణ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. లేదంటే మహిళలను కలుపుకొని దాడులను ప్రత్యక్షంగా ఎదుర్కొనేందుకు పూనుకుంటామని హెచ్చరించారు. మద్యం, మత్తు పదార్థాలను, మహిళలపై హింసను అరికట్టాలని ఐద్వా చేపట్టిన పోరుయాత్ర సోమవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పర్యటించింది. చిలకలూరిపేట, సత్తెనపల్లి, గుంటూరు, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లిలో పర్యటించిన యాత్ర బృందానికి ఆయా ప్రాంతాల్లో ఘన స్వాగతం లభించింది.



ప్రదర్శనలిస్తున్న విద్యార్థులు

యాత్రలో భాగంగా విద్యార్థినుల బృందం గేయాలాపలనతో ఉత్తేజ పరచడంతోపాటు లఘునాటికల ద్వారా సందేశాలిచ్చారు.

గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద మహిళలు, ఐద్వా నాయకులు యాత్ర బృందానికి పూలు జల్లి ఘనస్వాగతం పలికారు. అనంతరం విజ్ఞాన



సత్తెనపల్లిలో డబ్బుల దరువులతో స్వాగతం

మందిరంలో నిర్వహించిన సభకు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పద్మ అధ్యక్షత వహించారు. డి.రమాదేవి మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో మహిళలపై దాడులు పెరిగాయన్నారు. మహిళలపై దాడులు చేసిన వారిని, అత్యాచారాలు చేసిన వారిని బిజెపి కాపాడుతోందని విమర్శించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన దేశానికి మాయని మచ్చని, ప్రపంచలో ఎక్కడా ఈలాంటి ఘటన జరగలేదని అన్నారు. మణిపూర్‌లోని కొండ ప్రాంతంలో విలువైన ఖనిజ సంపదను దోచుకోవటానికి ఆయా ప్రాంతాలపై హక్కుల కోసం మైథీలను బిజెపి రెచ్చగొట్టిందన్నారు. ఈ కుట్రలో కుకీ తెగ

2లో

చురుగ్గా పరిశీలన

- ఓటర్ల జాబితాలో సచివాలయాల ఉద్యోగులకే కీలక పాత్ర
- ఈనెల 21 వరకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. గతనెల 21న గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిశీలన ప్రారంభమైంది. పోలింగ్ బూత్ లెవల్ అధికారి (బిఎల్‌ఓ) స్థాయిలో ఈ పరిశీలన కొనసాగుతోంది. గతంలో ఓటర్ల జాబితాల రూపకల్పనలో ఉపాధ్యాయులను కూడా వినియోగించే వారు. అయితే ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. వీరి స్థానంలో సచివాలయాల ఉద్యోగులకు బిఎల్‌ఓలుగా బాధ్యతలు అప్పగించారు. విఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, అడ్మిన్, వెల్ఫేర్ కార్యదర్శులకు ఓటర్ల సవరణ విధులు కేటాయించారు.

కొన్ని ప్రాంతాల్లో వాలంటీర్లను కలుపుకొని వెళ్లడంపై బిఎల్‌ఓలపై విమర్శలు వచ్చాయి. దీంతో ఎన్నికల సంఘం సీరియస్‌గా హెచ్చరించడంతో వాలంటీర్లను దాదాపుగా ఉపసంహరించారు. గుంటూరులో ఇద్దరు బిఎల్‌ఓలు విధి నిర్వహణలో సక్రమంగా పనిచేయడంలేదని,

2లో

పర్మినెంట్ చేసే వరకూ ఉద్యమిస్తాం

5లో

- మున్సిపల్ కార్మికుల ధర్నాలో వక్తలు
- నరసరావుపేటలో కదం తొక్కిన కార్మికులు - పల్నాడు కలెక్టరేట్ ముట్టడి

కొండవీటి వాగు సమస్యపై ఉద్యమం

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- పలు డిమాండ్లతో తీర్మానం ఆమోదం - కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో రైతుల దు:ఖదాయినిగా ఉన్న కొండవీటి వాగు సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమించాల్సిన అవసరముందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల రైతుల సమావేశం ఉండవల్లి గుహలు ఎదురుగా గల కొండవీటి వాగు ఒడ్డున నిర్వహించారు. సమావేశానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరావు అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ వాగు మొదలయ్యే తాడికొండ మండలం

2లో



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

పిన్నెల్లి ఆగడాలకు చెక్‌పెడతాం

- కారంపూడిలో యువగళం పాదయాత్ర సభలో లోకేష్
- ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులపై తీవ్ర విమర్శలు, హెచ్చరికలు



ప్రజాశక్తి - మాచర్ల/విజయపురిసౌత్

టిడిపి అధికారంలోకి రాగానే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు సంగతి చూస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హెచ్చరించారు. యువగళం పాదయాత్రలో భాగంగా పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడిలో సోమవారం నారా లోకేష్ పాదయాత్ర నిర్వహించారు. కారంపూడి శివారు క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభించి తాండా వద్ద రైతులతో సమావేశమయ్యారు. తరువాత ఎన్ఎస్‌పి కెనాల్ వద్ద స్థానికులతో మాట్లాడారు. కారంపూడి చెక్ పోస్టు వద్ద ముస్లిములతో, చెన్నకేశవస్వామి గుడి వద్ద యువతతో సమావేశమయ్యారు. వీర్లగుడి సెంటర్‌లో బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ పల్నాడు చరిత్రను గుర్తు చేసుకున్నారు. అనంతరం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై నిప్పులు చెరిగారు. ఎంతో చరిత్ర ఉన్న మాచర్లలో ఇప్పుడు వైసిపి నాయకులు చేస్తున్న అరాచకాలు, అక్రమాలు చూస్తుంటే బాధేస్తోందన్నారు. వెల్దుర్తి మండలం బోదిలవీడులో ఉప సర్పంచ్ కృష్ణమూర్తి ఆయన

2లో

కొండవీటి వాగు సమస్యపై ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)

లాం నుంచి ఉండవల్లిలో కృష్ణానదిలో కలిసే వరకు ఎక్కడ వాగు ఒడ్డు బలహీనంగ ఉందో? ఎక్కడ వాగుకు రివిట్‌మెంట్ చేయాలి ఉందో? గుర్తించకపోవడం అధికారుల తప్పిదమేనన్నారు. వాగును ఆధునీకరించాలని, ముంపు ప్రాంతాల్లోని పొలాలను గుర్తించి లైనప్ చేయాలని, ఈ విషయం మీద ఇంజినీర్లను కలిసి డిజైన్ రూపొందించడానికి రైతుసంఘం సిద్ధంగా ఉందని చెప్పారు. సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతలో కూరగాయలు, పూలు, ఆకుకూరలు, ఇతర ఆహార, వాణిజ్య పంటలు పండుతాయని, ఇలాంటి భూమి దేశంలోనే ఎక్కడా లేదని అన్నారు. అలాంటి భూముల్లో ఇప్పుడు పంటలే లేవన్నారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. వాగును బాగు చేస్తామని గత హోం మంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే సుచరిత హామీనిచ్చినా నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు కొండవీటి ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. తెలుగు రైతు సంఘ రాష్ట్ర నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి నాయకులు, ఎన్.రామారావు మాట్లాడుతూ రాజధానిని బలి పశువును చేయడానికి ప్రభుత్వం కొండవీటి వాగు సమస్యను పరిష్కరించడం లేదన్నారు. జనసేన పార్టీ నాయకులు సుందరయ్య మాట్లాడుతూ సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించాలన్నారు. వెంకటపాలెం మాజీ సర్పంచ్ బి.నరసింహారావు మాట్లాడుతూ పోరాటంతో ముందుకు పోవడంతో కొండవీటి వాగు సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. రైతు సంఘం నాయకులు డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజకీయా పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, లేనప్పుడు మరోమాట మాట్లాడి వాగు సమస్యను పరిష్కరించకుండా దాట వేస్తున్నాయని విమర్శించారు. అనంతరం ఈనెల 14న సిఆర్‌డిఎ అధికారులను కలవాలని, స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని, వాగు సమస్యను శాస్త్రీయంగా ఆలోచించడంతో పాటు బడ్జెట్ కేటాయించాలని కోరుతూ తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కొండవీటి వాగు సమస్య పరిష్కార కమిటీ కన్వీనర్‌గా కళ్లం రాజశేఖరరెడ్డి, కో-కన్వీనర్‌గా కె.జగదీశ్వరరెడ్డితోపాటు 19 మందితో కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్‌కె పీరూసాహెబ్, దాసరి కృష్ణ, పి.బక్కిరెడ్డి పాల్గొన్నారు.

చురుగ్గా పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఉద్యోగులను కమిషనర్ చేకూరి కీర్తి ఇటీవల సస్పెండ్ చేశారు. ఎల్.ఆర్.కాలనీ, రాజీవ్ గాంధీ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఇంటింటి సర్వేను ఆమె స్వయంగా పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు బిఎల్‌ఓలను సస్పెండ్ చేశారు. ఇప్పటికే గుంటూరులోని పలు డివిజన్లలో ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఒకే డోర్ నంబర్ లో ఎక్కువ ఓట్లు ఉండటం, జీరో డోర్ నంబర్ పై ఓటర్లను అనుమతించడం, ఇతర రాష్ట్రాల్లోని వారినీ జాబితాల్లో కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. వందేళ్లు దాటిన ఓటర్ల వయస్సు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. తల్లిదండ్రులు స్థానికంగా ఉన్నా పిల్లలు ఇతర దేశాలు, రాష్ట్రాల్లో ఉంటున్నా వారిపేర్లు చాలా కాలంగా జాబితాల్లో కొనసాగుతున్నాయి. వీటిని తొలగించడంపై అధికార్లు రాజకీయ వత్తిడితో పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. జాబితాలపై టిడిపి నాయకులు నిశిత పరిశీలన చేసి అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలపై టిడిపి, వైసిపి ప్రధానంగా దృష్టి సారించాయి. వైసిపి నుంచి పార్టీ బూత్ కమిటీల ఇన్‌ఛార్జులు, గృహసారధులతో జాబితాలపై నిశిత పరిశీలన చేస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, సత్తెనపల్లి, నర్సరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో జనసేన నాయకులు దృష్టిసారించారు. ఆగస్టు 21 వరకు సవరణపై పరిశీలన, 22 నుంచి సెప్టెంబరు 29 వరకు పోలింగ్ కేంద్రం స్థాయిలో జాబితాల పరిశీలన, ఓటర్ల ఫొటోల ముద్రణ చేపడతారు. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 16 వరకు సప్లిమెంటరీ జాబితాలను రూపొందిస్తారు. అక్టోబరు 17న డ్రాఫ్టు ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. అక్టోబరు 17 నుంచి 30 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబరు 28, 29, నవంబరు 18,19 తేదీల్లో కొత్తఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యంతరాలు, దరఖాస్తులను డిసెంబరు 26న పరిష్కరిస్తారు. జనవరి ఒకటిన తుది జాబితా సిద్ధం చేస్తారు. 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితాలను ప్రచురిస్తారు. ప్రక్రియను తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

హింస అధ్యయనానికి కమిషన్ వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు బలిపశువులు అయ్యారన్నారు. ఆసిఫాపై జరిగిన అఘాయిత్యం కూడా ముస్లింలను భూముల నుండి వెళ్లగొట్టేందుకేనని చెప్పారు. బిల్కిస్ బానో కేసులో నిందితులు సంస్కారవంతులని విడుదల చేయటం అన్యాయమన్నారు. బిజెపి ఎంపి నుండి లైంగిక వేధింపులు ఎదుర్కొన్న మహిళా రెజ్లర్లను తమకు న్యాయం చేయాలని రోడ్డెక్కితే వారిపై పోలీసుల్ని ప్రయోగించి ఈడ్చిపడేశారన్నారు. ఈలాంటి దుర్మార్గ పాలన చేస్తున్న బిజెకి రాష్ట్రంలోని ప్రభుత్వం మద్దతిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోనూ మహిళలపై దాడులు పెరిగాయన్నారు. అధికారుల అండతో మత్తుపదార్థాల విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. మద్యం, మత్తుపదార్థాలకు బానిసైన వారు మత్తులో బాలికలపై, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మద్యం వల్ల ఆడపడుచులు పడుతున్న బాధలు జగనన్నకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. మద్య నిషేధం అమలు హామీపై మాట తప్పారని, మడమ తిప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు తమ సత్తా చూపిస్తారని హెచ్చరించారు. మహిళలపై జరుగుతున్న దాడులపై విచారణను 21 రోజుల్లో పూర్తి చేయాలని తెచ్చిన దిశ చట్టం ఎన్ని కేసుల్లో ఆ విధంగా చేసిందో చెప్పాలన్నారు. మహిళలపై దాడులను విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కిట్స్ కాలేజి అధ్యాపకులురాలు సరళ మాట్లాడుతూ మాట్లాడుతూ హింస లేని సమాజం కోసం ఐద్వా చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం, ప్రజలు అందరూ కలిసి మద్యం నిషేధం కోసం, హింసకు వ్యతిరేకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విజ్ఞాన్ నిరులా కాలేజి ప్రొఫెసర్ భవానీ మాట్లాడుతూ ఐద్వా చేస్తున్న కృషికి తమ కళాశాల నుండి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. మలినేని కాలేజి అధ్యాపకులు మస్తాన్‌వలి మాట్లాడుతూ దాడులకు గురైన మహిళల్లో చాలా తక్కువ మంది పోలీసు స్టేషన్లను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని, వారిలోనూ న్యాయం దక్కుతున్న వారు చాలా తక్కువని చెప్పారు. మహిళలు సొంతకాళ్లపై ఎదగాలని సూచించారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ మాట్లాడుతూ మణిపూర్‌లో హింసపై 72 రోజుల తర్వాత ప్రధాని స్పందించాడన్నారు. వారి సమస్యలపై చర్చించటానికి మోడీకి సమయం లేదని, కానీ విదేశీ పర్యటనలకు మాత్రం సమయం ఉందని ఎద్దేవా చేశారు.

ఆలోచింపచేసిన కళారూపాలు

సభలో వివిధ ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థినులు రూపొందించిన కళాప్రదర్శనలు ఆలోచింపచేశాయి. బాల్యం నుండి సమాజంలో, కాలేజీలో, పెళ్లయ్యాక కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే వివక్షత గురించి నృత్య రూపకం ప్రదర్శంచారు. విజ్ఞాన్ నిరులా విద్యార్థినులు బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, గృహ హింసపై ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ప్రజానాట్యమండలి కళాకారులు 'ఎక్కడ వచ్చింది స్త్రీజాతికి స్వాత్యంత్ర్యం' అంటూ ప్రదర్శించిన నృత్య రూపకం, అభ్యుదయ గేయం ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణానికి చేరిన ఐద్వా పోరు యత్రకు 12వ వార్డు పిల్లి అంకమ్మ చౌక్ వద్ద మహిళలు పూలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక పండరీపురం నుంచి సాగిన యాత్రలో ప్రజానాట్య మండలి కళాకారుల గేయాలు ఉత్తేజం నింపాయి. అంకమ్మ చౌక్ వద సభలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడారు. అనంతరం యాత్ర పెదనందిపాడు రోడ్డులోని జి.ఆర్.జూనియర్ కళాశాలకు చేరింది. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడారు. లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీలో మహిళ లేజర్లు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన దుస్థితి సిగ్గుచేటన్నారు. అత్యాచార ఘటనల్లో నిందితులు అట్టడుగు వర్గాల వారు, పేదలైతే ఎన్‌కౌంటర్‌లకు గురువుతారని, ప్రముఖులు మాత్రం తప్పించుకుంటున్నారని విమర్శించారు. మద్యం అనేక రకాలా హింసలకు కారణమవుతోందని, దాన్ని దశల వారీగా నిషేధిస్తామన్న వైసిపి పాలనలో 70 శాతం పెరిగాయని విమర్శించారు. అన్యాయాలపై విద్యార్థులూ స్పందించాలని, ఏదో విధంగ తమ నిరసనలను వ్యక్తం చేయాలని చెప్పారు. విజయవాడలో మంగళవారం జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పట్టణానికి చేరిన బృందానికి మహిళా డప్పు కళాకారులు తప్పెట మోతతో ఘటన స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనగా స్థానిక తాలూకా సెంటర్‌కు చేరుకున్నారు. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ అధ్యక్షతన నిర్వహించిన సభలో రమాదేవి మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మతాల పేరుతో ప్రజలను విభజించి అధికారాన్ని పదిలం చేసుకోవాలనే కుట్రలో నిమగ్నమైందన్నారు. మనువాదం ప్రకారం మహిళలను ఎన్ని విధాలుగా హింసించిన తప్పు లేదని వాదనను దేశం రుద్దుతున్నారని, మణిపూర్ సహా అనేక ఘటనలు ఇందుకు తాజా ఉదాహరణలని వివరించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ మహిళల ఉద్ధరిస్తామంటూ ప్రచారం చేసుకునే వైసిపి, టిడిపిలు మణిపూర్ ఘటనలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వీర మహిళలని గొప్పలు చెబుతున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనం వహించారనానరు. అశ్లీల, మద్యం వ్యతిరేక ఉద్యమ నాయకులు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ వార పత్రికలలో అశ్లీల చిత్రాలను ప్రచురిస్తున్న పత్రిక యజమానులపై కేసులు పెట్టి శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. తొలుత ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు ఆధ్వర్యంలో కళాకారులు పాటలు పాడడంతోపాటు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి - పెదకాకాని : ఐద్వా జాతాకు మండల కేంద్రమైన పెదకాకానిలో ఘన స్వాగతం లభించింది. అనంతరం స్థానిక సుందరయ్య కాలనీలో సభ నిర్వహించగా డి.రమాదేవి మాట్లాడారు.

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి : సోమవారం రాత్రికి యాత్ర మంగళగిరి చేరింది. స్థానిక రత్నాల చెరువులో గల సింహాద్రి శివారెడ్డి భవనంలో జె.బ్రాహ్మణి అధ్యక్షతన సభ నిర్వహించగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడారు. విజయవాడలో మంగళవారం జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కళాకారులు గేయాలు ఆలపించడంతోపాటు ఆలోచింపజేసేలా ప్రదర్శనలిచ్చారు. తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డుకు చేరుకున్న బృందానికి స్థానికులు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభకు డి.విజయలక్ష్మీ అధ్యక్షత వహించారు. సావిత్రి, కె.పద్మ, అరుణ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసకుమారి, జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శివపార్వతి, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.అనురాధ, రిటైర్డ్ హెచ్‌ఎం.వనలక్ష్మి, ఐద్వా గుంటూరు నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, కార్యక్రమాల్లో ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి జి.మల్లేశ్వరి, నాయకులు పి.భారతి, ఎస్‌కె.ఫాతిమా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నభిత, అనురాధ, సిద్ధు, సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటశ్వర్లు, టి.కోటేశ్వరరావు, ఎస్.బాబు, ఎం.విల్సన్, సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులు ఎం.జ్యోతి, నాయకులు షేక్ ఆయేషా, కె.రమాదేవి, ఎం.రమాకుమారి, జి.నాగలక్ష్మి, ఆర్.శివపార్వతి, జి.ఎలిసెమ్మ, కుమారి, కోటమ్మ, అనుష, లక్ష్మి, అమూల్య, సుజాత, జె.రాజ్యలక్ష్మి, షేక్ హసీనా, పూర్ణ, కె.నాగమణి, నాయకులు విజయలక్ష్మి, మహాలక్ష్మి, మల్లేశ్వరి, శేషారత్నం పాల్గొన్నారు.

పిన్నెల్లి ఆగడాలకు చెక్ పెడతాం

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు కలిసి ముగ్గురు మహిళలపై దాడి చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. కేసు నమోదు చేయకపోగా ఉపసర్పంచ్ ఇంట్లో బంగారం పోయిందంటూ రివర్స్ కేసు పెడతామని పోలీసులు బెదిరించారని ఆరోపించారు. జగన్ అండదండలతోనే మాచర్లలో వైసిపి నాయకులు రెచ్చిపోతున్నారని అన్నారు. మాచర్లలో జరుగుతున్న అవినీతి, అరాచకాల గురించి తెలుసుకున్న తరువాత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేరు మార్చానని, ఇక నుంచి అతని పేరు పిల్లి రామకృష్ణారెడ్డి అని ఆయన తమ్ముడు పిల్లి వెంకట్రామిరెడ్డితో కలిసి నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి వచ్చే గ్రానైట్ లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాలంటేలి పిల్లి బ్రదర్స్‌కు లారీకి రూ.23 వేల చొప్పున పన్ను కట్టాలన్నారు. ఇలా రోజుకు 200 లారీల నుంచి రూ.46 లక్షలు దండుకుంటున్నారని నాలుగేళ్లలో రూ.700 కోట్లు దోచారని చెప్పారు. రాష్ట్రమంతా జగన్ జే బ్రాండ్లు అమ్ముతుంటే మాచర్లలో మాత్రం పి బ్రాండ్ లిక్కర్ అమ్ముతున్నారు. మద్యంపై పిన్నెల్లికి రోజుకు రూ.25 లక్షల ఆదాయం వస్తుందన్నారు. గుట్కా, మట్కా, గంజాయి, పేకాట క్లబ్బులన్నీ పిల్లి బ్రదర్స్ గ్యాంగులే నడిపిస్తున్నాయన్నారు. ఆత్మకూరు, రాయవరం, అలుగురాజుపల్లి, అడిగొప్పల అమ్మవారి గుడి పరిసర ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేపట్టారని, ఒక్క గ్రావెల్ దోపిడీలోనే పిన్నెల్లి బ్రదర్స్‌కు రూ.70 కోట్ల ఆదాయం వస్తోందని, ఇటుక తయారీ పరిశ్రమ యజమానుల్ని బెదిరించి రూ.5 కోట్లు కప్పం కట్టించుకున్నాడని, రేషన్ బియ్యం అక్రమ రవాణా ద్వారా రూ.73 కోట్లు సంపాదించారని ఆరోపించారు. నాగార్జున సాగర్ సాగునీటి కాల్వల నిర్వహణ, మరమ్మతులను బినామీ కాంట్రాక్టరు ద్వారా రూ.30 కోట్లు మింగేశారని, పనులు చేయకుండానే సుమారు రూ.15 కోట్లు పంచాయతీల నిధులు స్వాహా చేశారన్నారు. కౌలు రైతుల పేర్లతో రైతు భరోసా, ఇన్పుట్ సబ్సిడీలు కొట్టేసారన్నారు. మాచర్లలో ఎవరైనా అపార్ట్మెంట్ కట్టాలంటే పిల్లి బ్రదర్స్‌కు రూ.20 లక్షలు కప్పం కట్టాలన్నారు. రైతులు పొలం పాసుపుస్తకం కోసం అప్లై చేస్తే ఎకరాకు రూ. 15 వేలు వసూలు చేస్తున్నారన్నారు. తాళ్లపల్లి పరిధిలో రూ.50 కోట్ల విలువైన 250 ఎకరాలు కబ్జా చేసారని చెప్పారు. నాలుగేళ్లలో పిల్లి బ్రదర్స్ రూ.1000 కోట్లు అక్రమంగా సంపాదించారని అన్నారు. టిడిపి నాయకులు పంగా వెంకటేశ్వర్లు, గన్నెబోయిన గంగరాజుని, కోటయ్యను హత్య చేయించారన్న లోకేష్.. టిడిపి నాయకుల జోలికి వచ్చి పిన్నెల్లి సోదరులు పెద్ద తప్పు చేశారని, ఇక మీదటత తమ పార్టీ కార్యకర్తల జోలికొస్తే తోలుతీస్తా అని ఘాటు హెచ్చరికలు చేశారు. పిన్నెల్లి సోదరులకు భయం పుట్టిస్తానని అన్నారు. పిన్నెల్లి బ్రదర్స్ అండ్ గ్యాంగ్ మాచర్లలో ఉన్నా మద్రాస్‌కు పారిపోయినా పట్టుకొచ్చి లోపలేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జూలకంటి బ్రహ్మారెడ్డి మాచర్ల నుంచి టిడిపి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. మాచర్లలో ఉన్న 50 పడకల ఆసుపత్రి పరిధిని పెంచి అన్ని వైద్య సదుపాయాలతో 100 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌గా మార్పు చేస్తామని, దుర్గి మిర్చి యార్డులో లావాదేవీలు జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. బహిరంగ సభ తరువాత పేటసన్నిగుండ్లలో స్థానికులతో లోకేష్ సమావేశమయ్యారు. తరువాత పాదయాత్ర జూలకల్లు శివారు విడిది కేంద్రానికి చేరుకుంది. టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఇంటికి పంపిద్దామని, బ్రహ్మారెడ్డిని 25 వేలు పైగా మెజార్టీతో గెలిపించాలని కోరారు. పాద యాత్రకు వచ్చిన వారిలో చాలామంది ఎమ్మెల్యే అరాచకా లకు బలైన వారేనన్నారు. జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లా డుతూ ఎమ్మెల్యే ఆయన సోదరుడు మాచర్లకు పట్టిన రెండు దరిద్రాలని, బియ్యం మాఫియా సామ్రాజ్యానికి రాజులని దుయ్యబట్టారు. మాచర్ల నియోజకవర్గం అత్యంత వెనుకబడిన నియోజకవర్గం అని, ఈ ప్రాంతంలో విద్య వైద్య సౌకర్యాలు లేవని చెప్పారు. సామాజిక అణిచివేత ఎక్కువగా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వీటిని సరిచేస్తుందన్నారు.

ఇదిలా ఉండగా లోకేష్‌కు కారంపూడిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధిక సంఖ్యలో శ్రేణులు చేరుకున్నాయి. అక్కడ నుండి ఆరు కిలోమీటర్ల మేర జరిగిన పాదయాత్రలో జనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల మహిళలు లోకేష్‌కు హారతులు పట్టారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు బత్తాకాయలుతో చేసిన గజమాలతో ఒకచోట వేదిక దగ్గరలో పూలతో చేసిన గజమాలతో లోకేష్ స్వాగతం పలికారు. బహిరంగ సభలో మాజీమంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు, పత్తిపాటి పుల్లారావు, ఆలపాటి రాజేంద్రఃప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వి. ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ధూళిపాళ నరేంద్ర, నాయకులు అరవింద్‌బాబు, చిరుమామిళ్ల మధుబాబు, చిట్టాబత్తిన చిట్టిబాబు పాల్గొన్నారు.

పల్నాడు కలెక్టర్ 'స్పందన'కు196 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో జిల్లా, మండల అధికారులు మానవత్వం చూపాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. నరసరావుపేట కలెక్టరేట్ లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాల్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించారు. పెద్ద ఎత్తున జిల్లా ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుకుంటూ జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా ట్రైనీ కలెక్టర్, జిల్లా అధికారి లకు వినతి పత్రాలను అందజేశారు. 196 ఫిర్యాదులు అందాయి. తమ సమస్యలను పరిష్కరించాలని ఆయా ఫిర్యాదులలో కోరారు.ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించిన జిల్లా కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు సంబంధిత శాఖల జిల్లా అధికారులకు వాటిని అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయానికి తరలి వచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా, దాతలను జిల్లా అధికారులు సత్కరిం చారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల సొసైటీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వీరారెడ్డి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా: మండల కేంద్రం రొంపిచర్ల బొడ్రాయిసెంటర్‌లోని సొసైటీ కార్యాలయంలో నూతన అధ్యక్షుడిగా మేడికొండ వీరారెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా వీరారెడ్డి మాటాడుతూ రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తా నన్నారు. ప్రభుత్వం నుండి రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు సకాలంలో పంట రుణాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా వీరారెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు.

రమాదేవికి ఎల్.ఆర్ కాలనీ డ్వాక్రా మహిళలు వినతి



ప్రజాశక్తి-గుంటూరు

ఈటీవల స్థానిక ఎల్ఆర్ కాలనీలో ఒక డమ్మీ ఆర్.పి చేతుల్లో మోసపోయిన డ్వాక్రా మహిళలకు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఐద్వా పోరు యాత్ర సందర్భంగా గుంటూరు వచ్చిన రమాదేవిని బాధితులు కలిసి సమస్యను విన్నవించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ బాధితులకు అండగా ఉంటామని, వారికి న్యాయం జరిగే వరకూ పోరాడతామని హామీ ాచ్చారు. వినతిపత్రం ాచ్చిన వారిలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, ఎస్కె.బాష, ఎస్కె.సైదా, హ్యూమన్ రైట్స్ నాయకులు ఎస్కె.సలీమ్ తదితరులు పాల్గొన్నారు

పాలిటెక్నిక్ అడ్మిషన్ ప్రక్రియలో జాప్యం ఎందుకు ?

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని ఒక వైపు చెబుతూ అడ్మిషన్లను ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. పాలిసెట్ ద్వారా 1 లక్షా 41 వేల మంది దరఖాస్తు చేసుకోగా దాదాపు 1 లక్షా 20 వేల మంది ఉత్తీ ర్ణులయ్యారని వారిలో కొంత మంది ఇతర రాష్ట్రాలకు వెళ్ళడమో, ఇతర కోర్సుల్లో చేరడం జరిగిందని అన్నారు. నేటికి 76 రోజులు గడుస్తున్నా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఇంత తాత్సర్యం చేస్తుందని మండిపడ్డారు. డిప్లమో విద్య కు నానాటికి ఆదరణ తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. గత విద్యా సంవత్సరం 74,491 సీట్లు ఉంటే 35,735 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయన్నారు. గత అనుభవాలతో అడ్మిషన్లను పూర్తి చేసేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎన్నడు లేని విధంగా రెండు నెలలు పైగా ఆలస్యం చేయడం సిగ్గుచేటన్నారు.

ఈ ప్రభుత్వం నూతన వరవడి అంటూ అడ్మిషన్ ప్రక్రియ జాప్యం పై రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ తరపున ఆందోళన చేయమని విద్యార్థుల తల్లి దండ్రులు కోరారని అన్నారు. రాష్ట్రంలో డిగ్రీ, ఇంటర్ మినహా మిగిలిన అన్ని సెట్లు అడ్మిషన్లు పూర్తి కాకపోవడం విద్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనడానికి ఉదాహరణ అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పాలిటెక్నిక్ అధికారులు వారంలోగా వెబ్ ఆప్షన్స్ ప్రారంభించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతమని హెచ్చరించారు.

విద్యార్థులతో కలిసి వ్యవసాయాధికారుల భూసార పరీక్షలు



ప్రజాశక్తి-తెనాలి

వ్యవసాయశాఖ సిబ్బంది, పాఠశాల విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు నిర్వ హించనున్నట్లు వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ వివి విజయలక్ష్మి చెప్పారు. స్థానిక జగ్గడిగుంటపాలెం వ్యవసాయ క్షేత్రంలో మట్టినమూనాలను సేకరించి, స్థానికంగా ఉన్న కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులతో కలిసి సోమవారం భూసార పరీక్షలు నిర్వహించారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 28,053
మిర్చి ఎగుమతి	: 26,196
మిర్చి నిల్వ	: 11,030

మిర్చి ధరలు

రూపాయలలో

334	11,000 - 23,000
నెం.5	12,000 - 20,000
273	17,000 - 18,500
341	9,500 - 21,500
4884	18,500 - 18,500
సూపర్10	23,000 - 23,000
నాన్ ఎసి	
తేజ	10,000 - 24,000
బడిగి	12,000 - 25,000
తాలుకాయలు	5,000 -14,500
ఎసి	
334	13,000 - 20,000
నెం.5	11,500 -11,500
341	15,500 - 21,500
తేజ	14,500 - 23,800
బడిగి	15,000 - 26,000
దేవనూరు డీలక్స్	15,000 - 22,500
తాలుకాయలు	5,000 -13,000

వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



ప్రజాశక్తి - మంగళగిరి

ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రస్తుత కార్యవర్గమే మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ అధ్యక్షులుగా పుప్పాల కోటేశ్వరరావు, ఉపా ధ్యక్షులుగా రుద్రరాజు పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా వీసం వెంకటేశ్వర రావు, సహాయ కార్యదర్శిగా అంకం శ్రీనివాసరావు (మంగళగిరి బాబు), కోశాధికారిగా గోలి బాలమోహనరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఆదివారం ఫారెస్టు ఎకో హిల్ పార్కులో జరిగిన వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఎన్నికల పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా ఉన్న అసోసియేషన్ గౌరవ సలహాదారులు మంచా విజయమోహనరావు, ఎంఎస్ జిలాని, అవ్వారు కష్ణారావు, కొట్టే ఎలిషాపాల్, కొమ్మారెడ్డి వీరారెడ్డి, పి.శరశ్చంద్రప్రసాద్ లు నామినేషన్లను స్వీకరించారు. అయితే వాకర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో ఒక్కో పదవికి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో సోమవారం ఉదయం అసోసియేషన్ సభ్యుల వాకింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తొలుత ప్రజా ఉద్యమనాయకుడు, గద్దర్ మృతి పై ది మంగళగిరి వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సంతాపం ప్రకటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కాకరపర్తి సుబ్రహ్మణ్యంకు బెస్ట్ లయన్స్ అవార్డు



పురస్కారాన్ని అందుకుంటున్న సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్ర హ్మణ్యం బెస్ట్ లయన్స్ అవార్డును అందుక ున్నారు. గుంటూరులోని బివిఆర్ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి డిస్ట్రిక్స్ గవర్నర్ లయన్ కె.విజయచంద్ అధ్యక్షతన ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316హెచ్ విజేత అవార్డ్స్ పేరున నిర్వహిచిన పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా ఏపి హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ కె.మన్మధరావు పాల్గొన్నారు. ఆయనతో పాటు ఇంటర్నేషల్ డైరెక్టర్ పి.సురేష్‌బాబు చేతులమీదుగా కాకరపర్తికి పురస్కారం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ విఎస్‌విడి శివప్రసాద్, పలువురు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. పురస్కారం అందుకున్న కాకరపర్తిని లయన్స్‌క్లబ్ ఆఫ్ స్నేహ తెనాలి బృందం అభినందించారు.

రోటరీ క్లబ్ విస్తృత సేవలు అందివ్వాలి



నూతన కార్యవర్గంతో కలిసి మాట్లాడుతున్న శివనారాయణ

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

మానవ సేవే పరమార్థంగా భావించి సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ విస్తృత సేవలు అందివ్వాలని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి. శివ నారాయణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రోటరీ క్లబ్ నూతన ఎన్నికైన కార్యవర్గంలో అధ్యక్షులుగా మాతంగి సాంబశివరావు , కార్యదర్శిగా సరికొండ రమాదేవి , కోశాదికారిగా వనమా నాగేశ్వరావు వున్నారు .అనంతరం శివనారాయణ మాట్లాడుతూ ప్రజా సేవా చేయటానికి రోటరీ క్లబ్ ఒక మంచి వేదిక అన్నారు.



వ్యాక్సిన్ ప్రక్రియ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఇంటిన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా సోమవారం నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల అగ్రహారంలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఇప్పటిదాకా వ్యాక్సిన్ వేయించుకోని వారిని గుర్తించాలని, వచ్చే నెల 2 వరకు వ్యాక్సిన్ ప్రక్రియ కొనసాగించాలని, నూరుశాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా మాతా సంరక్షణ అధికారి డాక్టర్ డి.నాగపద్మజ, కోటప్పకొండ పిహెచ్‌సి వైద్యులు మమత కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

విఆర్ఎలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రెండ్రోజుల ధర్నాలు ప్రారంభం
- ప్రభుత్వం స్పందించకుంటే 25న చలో విజయవాడ



గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి



పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ధర్నా చేస్తున్న విఆర్ఎలు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా తమకిచ్చిన హామీలు అమలు చేయాలని విఆర్‌ఎలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని ధర్నా చౌక్‌లో రెండ్రోజుల ధర్నాలను సోమవారం ప్రారంభించారు. ధర్నాల్లో సంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు వడ్డే బాజీబాబు, షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడి తక్షణమే వాగ్దానాలను నెరవేర్చాలన్నారు. తెలంగాణలో మాదిరిగా ఇక్కడ కూడా విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హతున్న విఆర్‌ఎలలకు వీఆర్వోగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలుగా పని చేస్తున్న విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో ధర్నా శిబిరం వద్దకు వచ్చి సాక్షాత్తూ జగన్మోహన్‌రెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వ ఇచ్చిన డీఏనూ రికవరీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ విఆర్‌ఎలకు దక్కిన కొద్దిపాటి హక్కులైనా పోరాటం ద్వారానే వచ్చాయని, కావున సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ పోరాటం కొనసాగించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత నిర్బంధంగా, సమస్యలు పరిష్కరించడంలో అత్యంత నిర్లక్ష్యంగా ఉందన్నారు. ప్రభుత్వం సమస్యల పట్ల వేడుకుంటే పరిష్కరించ పోగా ఉన్న హక్కులను కాలు రాస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఆందోళణ చేస్తామని హెచ్చరించారు. పల్నాడులో ధర్నాకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి సంఘీభావం తెలిపారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే 25న చలో విజయవాడ నిర్వహిస్తామన్నారు. గుంటూరు ధర్నాలో జిల్లా గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సంగయ్య, ప్రధాన కార్యదర్శి షేక్.నాగుల్‌మీరా, ఉపాధ్యక్షులు జె.రాజేష్, సాంబశివరావు, జయపాల్, రమ్య, జయశ్రీ, వాణి, రామారావు, రవీంద్రబాబు, సురేష్, ఆదాంషఫీ, సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం.భాగ్యరాజు, ఎస్.ఎం.వలి పాల్గొన్నారు. పల్నాడు ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందరాజు, నాయకులు సంజీవరావు, సుబ్బారావు, సిద్ధయ్య, ఆనంద్, నాగేశ్వరరావు, కాసులు, రవి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భూమి కోసం దౌర్జన్యాలపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

'జగనన్నకి చెబుదాం'కు వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అర్జిదారుని పట్ల శ్రద్ధ వహించి గడువులోగా పరిష్కరించాలని పోలీసు సిబ్బందిని దిశ డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశించారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కుటుంబ, ఆస్థి, స్థల వివాదాలపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. అర్జిదార్లకు నరసరావుపేట పట్టణానికి చెందిన కంజుల శివభాస్కరరెడ్డి, కృష్ణసాయి లక్ష్మి జ్యువెలర్స్ అధినేత మేళ్లచెరువు వీరాంజనేయులు మనవడు రాజీవ్ గుప్తాలు భోజన ఏర్పాట్లు చేశారు.

భూమి తీసుకుని వెంచర్ యజమాని దౌర్జన్యం



తరతరాలుగా తమ స్వాధీనంలో ఉన్న 80 సెంట్లను ఆర్‌ఆర్ వెంచర్ యజమాని రాంబాబుకు విక్రయించానని, అయితే భూపత్రాలేమీ లేవని చెప్పగా అన్నీ తానే చూసుకుంటానని చెప్పి కొంత నగదు చెల్లించారని, తీరా అది దేవాదాయశాఖ భూమి అని, విక్రయానికి వీల్లేదని అధికారులు చెప్పారని ముప్పాళ్ల మండల కేంద్రానికి చెందిన గోవిందరెడ్డి ఫిర్యాదు చేశారు. తాను తీసుకున్న డబ్బు ఇస్తానని, భూమిని తిరిగివ్వాలని రాంబాబును కోరుతున్నా పట్టించుకోకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ముప్పాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

భూమిని కాజేయాలని మరిది పన్నాంగం



తన భర్త ఏసోబుకు 1981లో ప్రభుత్వం 5 సెంట్ల స్థలం ఇవ్వగా అప్పటి నుండి నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగించామని సత్తెనపల్లి మండలం కంటెపూడికి చెందిన మద్దు మల్లేశ్వరి తెలిపారు. భర్త ఏళ్ల క్రితం మృతి చెందాడని, తనతోపాటు మానసిక వికలాంగుడైన కుమారుడు అక్కడే ఉంటున్నామని చెప్పారు. అయితే భర్త సోదరుడు ప్రభుదాసు (లస్కర్) నకిలీ పట్టా సృష్టించి ఇంటిని కాజేయాలని చూస్తున్నాడని, సత్తెనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డబ్బులివ్వకుండా స్థలం కాజేయాలని



పిడుగురాళ్ల పట్టణం జానపాడు రోడ్డులో తమకు చెందిన 52 సెంట్ల స్థలాన్ని వివాదాల నేపథ్యంలో కోర్టులో గెలుచుకున్నామని, ఆ స్థలాన్ని కొనుగోలు చేస్తామని చెప్పిన సూరే మణికుమార్, పవన్‌రెడ్డి, నరసింహారావు, పాకర్తి నరసింహారావు, ఎం.ఖాసీం తదితరులు ఒప్పందం రాయించుకున్నారని పిడుగురాళ్లకు చెందిన గంధం గంగాభవాని ఫిర్యాదు చేశారు. ఒప్పందం ప్రకారం రూ.7 లక్షలు ఇవ్వాల్సిన వారు ఇవ్వకపోవడంతో పిడుగురాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా వారూ అక్రమార్కులకే మద్దతుగా ఉంటున్నారని వాపోయారు.

స్థలాన్ని కబ్జా చేసి దాడి



తమకు చెందిన 10 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన తుర్లపాటి కొండలు గేదెల్ని కట్టేసుకోవడానికి కొన్నాళ్లు వాడుకుని ఇప్పుడు కబ్జా చేశాడని, ప్రశ్నిస్తే దాడి చేశాడని రొంపిచర్ల మండలం గోగులపాడుకు చెందిన ఆత్మకూరి పెద్దిశెట్టి ఫిర్యాదు చేశారు. దీనిపై రొంపిచర్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

స్థలం కబ్జాకు విఆర్ఒ యత్నం



తమ స్వాధీనంలోని రెండు సెంట్ల స్థలాన్ని సమీప బంధువు, విఆర్ఒ అయిన సుద్ధపల్లి సైదా నకిలీ పత్రాలతో కబ్జాకు యత్నిస్తున్నాడని సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన షేక్ అబ్దుల్ మునాఫ్ ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు.

ఇంటి కోసం కొడుకులు, కోడళ్లు దాడి



అందరం కలిసి ఉంటున్న ఇంటిని తన తదనంతరం కుమారులకు చెందేలా వీలునామా రాశానని, అయినా ముందుగా రాయాలంటూ కుమారులు, కోడళ్లు ఒత్తిడి చేస్తున్నారని సత్తెనపల్లి పట్టణం శ్రీరాంనగర్‌కు చెందిన పల్లపు మాచమ్మ ఫిర్యాదు చేశారు. కంటిలో కారం పోయడం, తాగే నీటిలో మత్తు బిళ్లలు కలపటం, కర్రతో కొట్టడం వంటివి చేశారని, సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

ధాన్యం వ్యాపారి ఫిర్యాదు



వినుకొండకు చెందిన బియ్యం వ్యాపారి ఆత్మకూరి ప్రసాద్ తనకు వ్యాపారం లావాదేవీలలో భాగంగా రూ.6 లక్షలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించాడని, పైగా తానే ఇవ్వాల్సి ఉందంటూ కేసు పెట్టడానికి చూస్తున్నాడని మండల కేంద్రమైన కోసూరుకు చెందిన తమ్మంండ్ర నాగేశ్వరరావు అనే దాన్యం వ్యాపారి ఫిర్యాదు చేశారు. తనకు రైతుల నుండి వత్తిడి వస్తోందని, న్యాయం చేయాలని కోరారు.

గేదెలను అపహరించారు



ఆస్పత్రిలో ఉన్న కుమార్తెకు సహాయంగా రెండ్రులు వెళ్లిన సమయంలో తనకు చెందిన రూ.1.80 లక్షల విలువ చేసే మూడు గేదెలను మరియదాసు అనేవ్యక్తి అమ్ముకున్నాడని మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన కొప్పుల అంజమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేయగా రూ.లక్ష నష్టపరిహారం ఇప్పించడానికి ఒప్పందం చేసి 40 రోజులైనా పరిహారం ఇవ్వలేదని తెలిపారు. గేదెల పోషణ ద్వారానే ఉపాధి పొందుతున్న తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



పశువులను రానివ్వొద్దన్నందుకు దాడి

తమ పశువుల పాకలోకి సోదరులు నంబూరు కృష్ణమూర్తి, భూషయ్య, శ్రీనులకు చెందిన పశువులు నిత్యం వస్తు మేతను తింటున్నాయని, వాటిని రానివ్వొద్దన్నందుకు దుర్భాషలాడుతున్నారని, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినందుకు దాడి చేశారని వెల్దుర్తి మండలం బోధలవీడుకు చెందిన మామిళ్ళపల్లి కోటయ్య ఫిర్యాదు చేశారు.

ప్రేమ పెళ్లి చేసుకున్నా ప్రాణహాని

పోలీసుల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్న భర్త మూడు నెలలు గడవక ముందే తనపై, తన తల్లిదండ్రులపైన దాడి చేస్తున్నాడని, ఒక కేసు విషయంలో తమను చంపుతానని బెదిరిస్తున్నాడని నరసరావుపేట పట్టణానికి చెందిన నందిగం రాజేశ్వరి ఫిర్యాదు చేశారు. రొంపిచర్ల మండలం అలవాలకు చెందిన తన భర్త ఆలా వీరస్వామి నుండి ప్రాణహాని ఉందని చెప్పారు.

ఇంటి చాకిరంతా చేస్తున్నా హింసలు



ఇంటి పని మొత్తం తానే చేస్తున్నా భర్త, అత్తమామలు, ఆడపడుచు వేధిస్తున్నారని, అన్నం కూడా సరిగా పెట్టకుండా అదనపు కట్నం కోసం ఎనిమిదేళ్ల నుండి హింసిస్తున్నారని, నా కొడుకును కూడా దూరంగా ఉంచుతున్నారని నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన బండారు విజయమేరీ ఫిర్యాదు చేశారు. కట్నం కోసం తన భర్తకు మరో పెళ్లి చేయాలని చూస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇళ్ల మధ్య విద్యాసంస్థలొద్దు



ఇళ్ల మధ్యన విద్యా సంస్థలు ఉండటంతో వాటి వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందని, తమకూ ఇబ్బందిగా ఉందని చిలకలూరిపేట పట్టణం గాంధీపేట మూడో లైన్‌కు చెందిన ఎ.రాజేంద్రప్రసాద్, మరికొందరు ఫిర్యాదు చేశారు. భాష్యం, మోడ్రన్, శ్రీ చైతన్య, నిఖిల డిగ్రీ కళాశాలల వల్ల ఇబ్బంది ఉన్నట్లు చెప్పారు.

ఇంటిని చెల్లి కాజేసిందని అన్న ఫిర్యాదు

తన తల్లి తదనంతరం తనకు చెందాల్సిన ఇంటిని చెల్లెలు మాయమాటలు చెప్పి రాయించుకుందని, ప్రశ్నిస్తే కుటుంబ సభ్యులతో కలిసి బెదిరిస్తోందని పిడుగురాళ్ల పట్టణం పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన చల్లగుండ్ల వెంకయ్య ఫిర్యాదు చేశారు.


గుంటూరు కలెక్టరేట్ వద్ద బైటాయించిన మున్సిపల్ కార్మికులు


నరసరావుపేటలో పల్నాడు కలెక్టరేట్ వద్ద

పర్మినెంట్ చేసే వరకూ ఉద్యమిస్తాం

మున్సిపల్ కార్మికుల ధర్నాలో వక్తలు

నరసరావుపేటలో కదం తొక్కిన కార్మికులు - పల్నాడు కలెక్టరేట్ ముట్టడి

సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ హామీ

ప్రజాశక్తి-గుంటూరు : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేసే వరకు ఉద్యమిస్తామని, అవసరమైతే రాష్ట్ర వ్యాపిత సమ్మెకు కూడా వెనుకాడబోమని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ముత్యాలరావు హెచ్చరించారు. మున్సిపల్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, 010 పద్దు క్రింద జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, చెత్త తరలించే వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, యుజిడి కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ గేటు వద్ద బైటాయించారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు అందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నేటికి నాలుగున్నర సంవత్సరాలు అవుతున్నా కేవలం ఆరు వేల మందినే పర్మినెంట్ చేస్తున్నట్లు ప్రకటించటం మోసపూరిత చర్య అన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పోరాటం కొత్తకాదని, పోరాటాల ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. మున్సిపల్ కార్మికులు చేసే పోరాటాలు విజయవంతం అయ్యే వరకూ సిఐటియు అండగా ఉంటుందన్నారు. రాజధాని పారిశుధ్ధ్య కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు యం.రవి మాట్లాడుతూ మంగళగిరి-తాడేపల్లి కార్పరేషన్‌లో రాజధాని ప్రాంతంలోని 21 గ్రామాలను విలీనం చేశారని, వారికి మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. హెల్త్ అలవెన్స్ కూడా ఇవ్వట్లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, తాడేపల్లి డివిజన్ కార్యదర్శి వి.దుర్గారావు, పొన్నూరు డివిజన్ కార్యదర్శి యన్.రమేష్‌బాబు, మంగళగిరి పట్టణ కార్యదర్శి కమలాకర్, యూనియన్ జిల్లా అధ్యక్షులు రాచూరి వేణు, రాష్ట్ర కమిటి సభ్యులు వెంగమ్మ, జిల్లా నాయకులు మంగళగిరి వెంకటేశ్వర్లు, పూర్ణచంద్రరావు, మంగయ్య, పూనేపల్లి శ్రీనివాసరావు, భూషమ్మ, మంగమ్మ, రాజేష్, రాచూరి వెంకటేశ్వర్లు, సుధాకర్, కుంబా శివయ్య, కాళంగి భాగ్యరాజు పాల్గొన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్


కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళుతున్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : చెత్త బండి పోతుంటే సామాన్య ప్రజలు ముక్కు మూసుకుని పోతారని అటువంటిది అదే చెత్త కంపులో పారిశుధ్య కార్మికులు చేతులతో చెత్తను ఎత్తి పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నారని వారికి సమాన పనికి సమాన వేతనాలు లేదా కనీస వేతనాలు రూ 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. ముందుగా కార్మికులు స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద ధర్నాకు యూనియన్ జిల్లా కార్యదర్శి అమరారపు సాల్మన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీని విస్మరించారని ఎద్దేవాచేశారు. సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంత రెడ్డి మాట్లాడుతూ 2018 లో కేంద్ర ప్రభుత్వ కమిటీ సిఫార్సు మేరకు రూ 18 వేలు కనీస ఇవ్వాలని కమిటీ చెప్పిందని ప్రస్తుతం రూ వేలు కనీస వేతనాలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.కార్మికులకు చెప్పులు,సబ్బులు, కొబ్బరినూనె, బెల్లం, మాస్కులు,గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు వి.చంద్రకళ, షేక్ సిలార్ మసూద్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మల్లీశ్వరి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి తెలకపల్లి శ్రీను, హరిపోతురాజు పాల్గొన్నారు.

సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ వద్దకు వచ్చి కలెక్టర్ బయటకు రావాలని నినాదాలు చేశారు. స్పందనలో ఉండడం వలన బయటకు రావడం వీలుపడదని యూనియన్ నాయకులు వచ్చి కలవాలని పోలీసులు సూచించారు. ససేమిరా అన్న కార్మికులు పోలీసులను నెట్టుకుంటూ గేట్లు దూకుతు లోపలికి వెళ్లి నినాదాలు చేయడంతో సెల్లార్ లోకి వచ్చిన కలెక్టర్ కార్మికులతో మాట్లాడారు. పర్మినెంట్ చేసే విషయం తమ పరిధిలో లేదని ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకువెళతానని స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న పాశం రామారావు

నివాసం ఉన్న చోటనే పట్టాలివ్వాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ప్రాంతంలో పేదలు నివాసం ఉన్న చోటనే ఇళ్లకు పట్టాలివ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కెఎల్‌రావుకాలనీ, సీతానగరం, బోటుయార్డు తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదలు ఉండవల్లి సెంటర్‌లోని సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాలో రామారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం, అప్పటి ప్రతిపక్షంగా ఉన్న అధికార పక్షం కెఎల్‌కాలనీ వాసులకు ఇచ్చిన హామీ నేటి వరకు నెరవేర్చలేదన్నారు. తాడేపల్లి ప్రాంతంలో సుమారు ఆరు వేల మందికి స్థలాలిప్పించి ఇళ్లు వేయించిన చరిత్ర సిపిఎందేనని స్పష్టం చేశారు. గత 40 సంవత్సరాల నుంచి పేదలు ఉంటున్న స్థలాలకు ఇళ్లపట్టాలివ్వాలని సిపిఎం కోరుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానిలో సెంటు స్థలం కావాలని ప్రజలు ఎవరూ అడగలేదని చెప్పారు. ప్రజలు అడగకపోయినా వివాదాస్పదమైన స్థలంలోకి పేదలను తీసుకెళ్లి ఇబ్బందిపెట్టడం సరికాదన్నారు. తాజాగా ఇళ్ల నిర్మాణాలు నిలుపుదల చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఏం సమాధానం చెబుతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పేదలకు న్యాయం చేయాలని చిత్తశుద్ధి ఉంటే నివాసం ఉన్న చోటనే పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజధానిలో పేదలకు కేటాయించిన భూముల్లో వర్షం వస్తే మోకాళ్ల లోతు నీళ్లల్లో ఎలా ఉంటారని ప్రశ్నించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే పేదలకు సెంటున్నర స్థలం ఇవ్వాలన్నారు. ఇరిగేషన్, అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కొట్టె కరుణాకరరావు, సోలా ముత్యాలరావు, కె.మేరి, వేంపాటి సామ్యేలు, దర్శనపు విజయ్‌బాబు, మారిన నాగేశ్వరరావు, కాళిదాసు, నాగరాజు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందనకు 168 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

తమ సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కరించిన అర్జీలు తిరిగి రీఓపెన్ కాకుండా వుండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం . వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్ రావు, డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 168 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష విజయవంతం అయినందుకు అధికారులకు అభినందనలు తెలిపార. అలాగే ఓటర్ల జాబితాపై డోర్ టు డోర్ సర్వే, ఆగస్టు 9 నుండి వారంపాటు చేపడుతున్న ఆజాదీ కా అమత్ మహెూత్సవ్, అక్టోబర్ 2 నుండి నుండి ఆడుదాం ఆంధ్ర తదతర కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ, డ్వామా పీడీలు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, పంచాయతీ రాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

సార్టెక్స్ బియ్యంతో వంటల పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : పేదవారి ఆహారభద్రతకై రాష్ట్ర ప్రభుత్వం అనేక వ్యయ ప్రయాసాలకోర్చి నాణ్యమైన మధ్యస్థ సన్నరకం బియ్యాన్ని సార్టెక్స్ చేసి, బలవర్ధకమైన పోర్టిఫైడ్ (ఐరన్ బి12, పోలిక్ యాసిడ్) గుళికలు కలిపి తెల్లరేషన్ కార్డుదారులకు అందజేయటం జరుగు తుందని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి కోరారు. బియ్యం నాణ్యత పోషకత్వంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో పోర్టిఫైడ్ రైస్‌తో వంట పోటీలు భారీగా నిర్వహిచారు. 54 మంది మహిళలు పాల్గొని పిడిఎస్ బియ్యంతో పులిహోర, పాలతాలికలు, క్యారెట్ దోశ, అరిశలు, బూరెలు, గోంగూర రైస్ వంటి సుమారు 50 రకాల రకాల ఆహార పదార్థాలు తయారు చేశారు. తయారు చేసిన ఆహార పదార్థలను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి పరిశీలించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి షేక్ హసీనాకు మొదటి బహుమతిగా మిక్సర్ గ్రైండర్, లక్ష్మీరాజ్యంకు రెండో బహమతి ఎలక్ట్రిక్ రైస్ కుక్కర్, మూడో బహుమతి యం.సత్యవతికి నాన్‌స్టిక్ గిన్నెలు అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ ప్రశంస పత్రాలు, స్టీల్ బాక్స్, గ్యాస్ లైటర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పిడిఎస్ బియ్యాన్ని ఇతరులకు విక్రయించటం నేరమని, ప్రభుత్వం రూ.40లు వెచ్చించి ప్రజలకు అందిస్తుందని, కావున ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

గుంటూరు ఛానల్‌కు నిధులు విడుదల చేయాలి



85 ఏళ్ల నుండి అనేక ప్రభుత్వాలు గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ విస్తరించి, ఆయా గ్రామాల ప్రజలకు నీరు అందిస్తామని చెబు తున్నా ఆచరణ రూపం దాల్చలేదని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ అన్నారు. గుంటూరు ఛానల్ విస్తరించాలని స్పందనలో అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల కాలంలోనూ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి హామీలు ఇచ్చినా అమలు చేయలేదు. శాంతియుత ఆందోళనలను భగ్నం చేస్తున్నారు. నీళ్లు అడుగుతుంటే అణచివేయాలని చూడటం దుర్మార్గం.కాల్వను పొడిగిస్తే ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల్లోని 50 గ్రామాలకు త్రాగునీరు, సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇంతటి ముఖ్యమైన ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయటం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గుంటూరు ఛానల్ విస్తరణకు సంబంధించి భూసేకరణకు నిధులు విడుదల చేయాలి. అర్జీ ఇచ్చిన వారిలో లావు అంకమ్మచౌదరి, జాస్తి వీరయ్యచౌదరి, మన్నవ హరిప్రసాద్, కారుమంచి విజయ్‌కుమార్, హరిబాబు తదితరులున్నారు.

జిఎంసి స్పందనకు 32 ఫిర్యాదులు



ప్రజాశక్తి-గుంటూరు : నగర కమిషనర్ ఆదేశాల మేరకు నగర అదనపు కమిషనర్ పెద్దిరోజా సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు.ఈ స్పందనలో 32 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. వాటిలో వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 7, ఇంజినీరింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 7, పరిపాలన విభాగానికి సంబందించి 1, ఉపాసెల్ విభాగం సంబంధించి 1 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి స్పందనలో ఒకే అర్జీ

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ శారదా దేవి హాజరయ్యారు. ఉండవల్లి జవహర్ విద్యానికేతన్ వద్ద ఐసిఐసిఐ బ్యాంక్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించాలని ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి వినతి పత్రాన్ని అందజేసినట్లు కమిషనర్ శారదా దేవి తెలిపారు. సదరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చునని తెలిపారు.



యువగళం పాదయాత్రకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర నేడు పిడుగురాళ్ల రానున్నడంతో పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏర్పాట్లను పూర్తి చేశారు. జూలకల్లు నుండి ఉదయం ప్రారంభమయ్యే పాదయాత్రకు మార్గమంతా తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలతో పార్టీ అభిమానులు కార్యకర్తలు ఘన స్వాగతం తెలుపుతున్నారు. పాదయాత్ర సందర్భంగా పిడుగురాళ్ల మండల, పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినటువంటి కటౌట్లు, బ్యానర్లు ప్రధాన ఆకర్షణగా కనబడుతున్నాయి. పాదయాత్రతో తెలుగుదేశం పార్టీ నాయకుల్లో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం కనబరుస్తున్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ముందస్తు ఏర్పాట్లు నిరహిస్తున్నారు. జరుగుతున్న ఏర్పాట్లు పై మాజీ శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.సోమవారం రాత్రి సమయానికి పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి పాదయాత్ర చేరుకుంటుందని రాత్రి బస అనంతరం 8వ తేదీ ఉదయం పాదయాత్ర ప్రారంభమవుతుందని అన్నారు. జూలకల్లు, గుత్తికొండ శివారు, పందిటివారిపాలెం గ్రామాల మీదుగా మధ్యాహ్నానికి జానపాడు గ్రామం చేరుకుంటారని, మధ్యాహ్న భోజనం అనంతరం పాదయాత్ర పిడుగురాళ్లలోని జానపాడు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మ వారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సభ వద్దకు చేరుకుంటుందని అన్నారు. సభ ముగిసిన తర్వాత పట్టణ శివారు ప్రాంతంలోని వల్లల గార్డెన్స్ వద్ద రాత్రి బస చేస్తారని అన్నారు.



షూటింగ్ బాల్ జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్స్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికలు సోమవారం జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలలు కళా శాలల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడా కారులకు జిల్లా జట్టులో స్థానం కల్పించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12 , 13 తేదీలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పల్నాడు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, పి.శివరామకృష్ణ, లక్ష్మీ తిరుపతమ్మ, ప్రసన్న, బి.శివకృష్ణ, షేక్ ఆదం షఫీ, తదితరులు పాల్గొన్నారు.

బాలుర జట్టు: ఎం.జీవన్ రెడ్డి, జి. హనుమ, వై. శామ్యూల్, వి.నాగేష్, జె.చంద్ర శేఖర్, బి-శేఖర్, ఎల్.సాయికుమార్,కె. నవీన్, జి. సురేష్, పి.నవీన్, ఎస్.భార్గవ్, ఎల్. అరవింద్, వై.యస్.లికిత్, కె. మహేష్, వై.ఎస్. అఖిల్

బాలికల జట్టు: పి.కీర్తిప్రియ, కె. దేవిశ్రీ, ఎం.హారిక, వై.ప్రవల్లిక, వై.కృపారాణి,ఎం.నందిని, టి.భార్గవి, ఎన్. మానుష, ఎం.త్రివేణి, కె.గౌతమి,పి.నాగతేజ, జి.హేమలత, బి.యామిని కీర్తి, పి. సుచరిత

ఉత్తమ రైతులకు కలెక్టర్ సన్మానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ విభాగాలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పలు పంటలు పండిస్తున్న రైతులను కలెక్టర్ శివ శంకర్ లోతేటి ప్రశంసించారు. సోమవారం పల్నాడు జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంలో రైతుకు వందనం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ, ఉద్యానవన పంటలు సహజ విధానంలో పండించిన పలు రకాల ఆహార ఉత్పత్తులు, కూరగాయలను ప్రదర్శించారు. సత్తెనపల్లి, చిలకలూరిపేట, నియోజక వర్గాల్లో పలు గ్రామాల్లోని ఉత్తమ రైతులు రాజుపాలెం మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన చింతపల్లి ప్రణతి, మాను కొండవారిపాలెం గ్రామానికి చెందిన టి. సుబ్బారెడ్డి, జి నాగభూషణం, వేణుగోపాలరెడ్డి, ముప్పాళ్ల మండలానికి చెం దిన లక్ష్మారెడ్డిని కలెక్టర్ అభినందించారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన కూరగాయలు, ఆహార ఉత్పత్తుల ప్రదర్శనా కార్యక్రమానికి పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రకతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పంటను నేరుగా వినియోగదారులకు అమ్మకాలు జరపటం వలన బయట మార్కెట్ కన్నా తక్కువ ధరకు విక్రయించడం వలన రైతులకు వినియోగ దారులకు లాభదాయ కంగా ఉం టుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తుల స్టాల్‌ను ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెసి ఎ.శ్యాంప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బెన్నీ, డిఆర్ఒ వినాయకం, పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు ఎరువులతో నాణ్యమైన ఉత్పత్తులు

'పల్నాడు వర్మి- పొలానికి బలిమి' అనే నినాదంతో కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో వర్మీ కంపోస్టు సహజ ఎరువు అమ్మకాలు జిల్లాలో జరుగుతున్నాయి. నాదెండ్ల మండలం ఇర్లపాడుకు చెందిన రైతు ఆలూరి శ్రీనివాసరావు 15 క్వింటాళ్ల వర్మీ కంపోస్ట్ ఎరువును సోమవారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా రైతు శ్రీనివాసరావును కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. ప్రతి గ్రామపంచాయతీలో వర్మి కంపోస్టు ఎరువును తయారు చేసి రైతులకు సరసమైన ధరలకు అందించాలని కలెక్టర్ అన్నారు. లింగంగుంట్ల పంచాయతీ కార్యదర్శి కెవి. శివప్రసాద్‌ను కలెక్టర్ అభినందించారు.



రైతులను సత్కరిస్తున్న కలెక్టర్ శివశంకర్

లబ్ధిదారుడికి కారు తాళాలు అందజేసిన కలెక్టర్

పెదకూరపాడు నియోజకవర్గంలోని మాదిపాడు కి చెందిన వై.గాబ్రియల్ నవోదయం కార్యక్రమంలో వాహనం కొనుగోలు రుణం కావాలని దరఖాస్తు చేసు కున్నారు. కెనరా బ్యాంక్ సహకారంతో డిజైర్ వెహికల్‌ను బడుగు వికాసం స్కీం కింద 45 శాతం సబ్సిడీతో లోన్ మం జూరు చేశారు. మంజూరైన వాహనాన్ని లబ్ధిదారునికి కలెక్టర్ అందజేశారు.

అభివృద్ధిపై సెల్ఫీ ఛాలెంజ్‌కు లోకేష్ సిద్ధమా?

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

గురజాల నియోజకవర్గం లో గత నాలుగు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి పై యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న నారా లోకేష్ సెల్ఫీ ఛాలెంజ్‌కు సిద్ధమని గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైసిపి అభివృద్ధి చేసిన పలు ప్రాంతాలలో పర్యటించిన ఎమ్మెల్యే 'నారా లోకేష్ సెల్ఫీ ఛాలెంజ్‌కు' సిద్ధమా అని ప్రశ్నించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోందన్నారు.



ఘనంగా చేనేత దినోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు,పల్నాడుజిల్లాల విలేకరులు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సోమవారం 9వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. భారతదేశ సంస్కృతీసంప్రదాయాలలో చేనేత రంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. 9వ జాతీయ చేనేత దినోత్సవం సం దర్భంగా నరసరావుపేటలో పల్నాడు జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ర్యాలీని చేనేత కార్మికులతో కలిసి కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించారు. కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ లు చేనేత వస్త్రాలు ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చేనేత రంగానికి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. జిల్లాలో 3 ప్రత్యేక చేనేత క్లస్టర్ లను ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం, పెన్షన్లు, వ్యాపార అబివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇక నుంచి ప్రతి నెలా మొదటి సోమవారం జిల్లాలో అధికారులంతా చేనేత వస్త్రాలను ధరించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం చేనేతరంగం అభివృద్ధికి కృషి చేస్తున్న పెద్దలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ట్రైనీ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వనజ, ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుస్తుల ఎగ్జిబిషన్ ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలె క్టర్‌లు సందర్శించారు. వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. పెదకూరపాడు మండలంలోని లగడపాడులో గుంటూరు జిల్లా చేనేత ఐక్యవేదిక సంఘం ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం నిర్వహించారు.

చేనేత మగ్గం షెడ్లు ప్రారంభం

మంగళగిరి పట్టణంలో రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మూడు కోట్ల 70 లక్షల రూపాయలతో 146 మందికి 6 మగ్గాల షెడ్లను నిర్మించడం జరిగింది. ఈ షెడ్లను సోమవారం రాత్రి చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీత, హ్యాండ్లూమ్ డిపార్ట్మెంట్ కమిషనర్ నాయక్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. మగ్గం షెడ్లకు చేనేత కోసం పనిచేసిన వారి పేర్లను పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ 146 మందికి నేతన్న నేస్తం పథకం కూడా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, కార్పొరేషన్ కమిషనర్ యు.శారదా దేవి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి పాల్గొన్నారు.


మంగళగిరిలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య చిత్ర పటానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేనేత పరిశ్రమ అభి వృద్ధికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకారం అందించాలని, నేతపై విధించిన జీఎస్టీ విధానాన్ని తొల గించాలని హనుమంతరావు కోరారు. మంగళగిరిలోని మాస్టర్ వీవర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు మగ్గాల బిల్డింగ్‌లో జరిగిన కార్యక్రమంలో చేనేత కార్మికులతో పుస్తకావిష్కరణలు జరిగాయి. మానవవికాస మండలి ఆధ్వర్యంలో దామెర రాములు రచించిన 'నేను సావిత్రి బాయ్ పూలే మాట్లాడుతున్నా' పుస్తకాన్ని చేనేత కార్మికులు కౌతరపు రామచంద్రరావు ఆవిష్కరించారు. వనపట్ల సుబ్బయ్య రచించిన 'బహుజన బావుటా' దీర్ఘ కావ్యాన్ని గాయకులు చేనేత కార్మికులు అల్లక తాతారావు ఆవిష్కరించారు. మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేనేతపై విధించిన జీఎస్టీని రద్దు చేయాలని, చేనేతకు జీరో జీఎస్టీ అమలు చేయాలని కోరుతూ గత 14 మాసాలుగా వారు పోరాటం చేస్తున్న అఖిలభారత పద్మశాలి సంఘం దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట నుంచి రాజ్‌ఘాట్ వరకు మౌన నిరసన మార్చ్ నిర్వహించారు. అనంతరం కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. చేనేతకు జీరో జిఎస్టి అమలు చేయాలని, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే దీనిపై ఒక నిర్ణ యం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చేనేతకు చేయూత కార్యక్రమంలో భాగంగా నారా లోకేశ్ సహకారంతో నాలుగో విడతలో చేనేత మహిళలకు మాజీ ఎంపి నిమ్మల కష్టప్ప, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ స్థానిక నాయకులతో కలిసి ఉచితంగా రాట్నాలను పంపిణీ చేశారు.ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం జరిగింది. లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ అధ్యక్షులు లయన్ ఎన్ వి గుప్తా మాట్లాడారు. అనంతరం గణితం ఉపా ధ్యాయులు కాకుమాను జోజప్ప 200 నోట్ పుస్తకాలను, 400 పెన్నులను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు పి.బుజ్జిబాబు, లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహా నగర్ సభ్యులు నాగేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ ఉమామహేశ్వర రావు, బెనర్జీ, పాఠశాల ఉపాధ్యాయులు డివి రమణమ్మ, సుందర్ రాజు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ మండలం ఆత్మకూరులో నిమ్మగడ్డ రామ్మోహన రావు విజ్ఞాన కేంద్రంలో సభ జరిగింది. చేనేత కార్మిక సంఘం నాయకులు బిట్రా రాంబాబు అధ్యక్షతన జరిగిన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కౌతరపు వెంకటేశ్వరరావు, డోకుపర్తి రామారావు మాట్లా డారు. తెనాలి చేనేత సహకారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం చైర్మన్ దామర్ల విజయ రాణి అధ్యక్షత వహించారు. చేనేత సహకార సంఘం, దాని అనుబంధంగా ఉన్న చేనేత కార్మికులు 70 మందిని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సత్కరించారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్



మంగళగిరిలో మగ్గాల షెడ్లను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ సునీత తదితరులు



వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, పంపిణీ చేస్తున్న కాకుమాను జోజప్ప

నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

- ప్రమాదాలకు నిలయంగా నిడమర్రు రోడ్డు
- త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఎం రాస్తారోకో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి - అమరావతి ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణపు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వ ర్యంలో సోమవారం నిడమర్రు రావి చెట్టు సెంటర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సిపిఎం రాజధాని డివిజన్ కార్య దర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ నిడమర్రు, అమరావతి రోడ్డుకు శంకుస్థాపన జరిగి 9 నెలలు దాటిందని, దీని నిర్మాణపు పనులు ఇంకా పూర్తి కాలేదని , ఇప్పటి వరకు సుమారు 18 ప్రమాదాలు జరిగాయని, అనేక మంది గాయాలపాలయ్యారని, ఎన్ని ప్రమాదాలు జరిగినా రోడ్డుకు మాత్రం గ్రహణం వీడటం లేదని అన్నారు. రాష్ట్ర సచివాలయం కోసం రెండవ రోడ్డుగా ఉన్నప్పటికీ ఇదే రోడ్ లో ఎస్ఆర్ఎం, అమృత యూనివర్సిటీలకు చెందిన వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న రహదారి వలన కాలేజీ బస్సులు వచ్చే సమయంలో దుమ్ము విపరీతంగా వస్తోందని, వాహనాలకు రిపేర్లు వస్తున్నామని ఆటో డ్రైవర్లు, బైకుల వాళ్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ రోడ్డు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా నడవని పరిస్థితి నెలకొందని అన్నారు. దీంతో పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందని, వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

నిడమర్రు మాజీ సర్పంచ్ జి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నో రోజులుగా కొత్త రోడ్డు పేరుతో ఉన్న రోడ్డును కూడా పాడు చేశారని, బైక్ పై వెళ్లే సమయంలో వాటి టైర్లు జారి పోతున్నాయని, వెంటనే స్పందించి అధికారులు రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మాజీ ఎంపీటీసీ సభ్యులు కె.ప్రకాష్‌రావు మాట్లాడుతూ రోడ్డుమీద నడిచినా, వాహనంలో ప్రయాణం చేసినా దుమ్ము కొట్టుకు పోతున్నామని అన్నారు. దుమ్ము లేకుండా నీటిని చల్లడం లేదని, దీంతో ఇళ్లల్లోకి దుమ్ము వస్తోందని చెప్పారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ఒకటవ శాఖ కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, జి.నాగేశ్వరరావు, కె.వీరయ్య, కె.స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు



అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి-తాడేపల్లి


టి.వీరభద్రరావు

ఒక వ్యక్తి చనిపోయి నలుగురి జీవితాల్లో కొత్త వెలుగును ప్రసా దించిన సంఘటన సోమవారం జరిగింది. విజయవాడకు చెందిన టి.వీరభద్రరావు (68) అనారోగ్య రీత్యా విజయవాడలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం మణి పాల్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం డాక్టర్లు అతన్ని బ్రెయిన్ డెడ్‌గా గుర్తించారు. వీరభద్రరావు భార్య అను రాధ, కుమార్తె, కుమారుడి అంగీకారంతో జీవన్‌ధాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటి పూడి ఆధ్వర్యంలో అవయవదానానికి ముందుకు వచ్చారు. కాలేయం, కిడ్నీని మణిపాల్ ఆసుపత్రికి, కార్నియా ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు, మరొక కిడ్నీని వేదాంత ఆసుపత్రికి తరలించారు. ఈ మంచి కార్యక్రమానికి ముందుకు వచ్చిన దాత కుటుంబానికి మణిపాల్ ఆసుపత్రి యాజమాన్యం అభినందనలు తెలిపింది.


పెదనందిపాడు పిఎసిఎస్ నూతన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన దివ్వి నాగేశ్వరరావు

పిఎసిఎస్ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెదనందిపాడు

పెదనందిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పిఎసిఎస్) నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు చెరుకూరి సాంబశివరావు అధ్యక్షత వహించారు. చైర్ పర్సన్‌గా నియమితులైన దివ్వి నాగేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీకి సొంత బిల్డింగ్ నిర్మించేందుకు, రైతు లకు సకాలంలో రుణాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. నూతన సొసైటీ డైరెక్టర్‌గా పి.ప్రసాద్, బి.సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ కాసిం పీరా, పెదనందిపాడు ఎంపిపి టి.హెప్సిబా, ఎబి పాలెం సొసైటీ చైర్ పర్సన్ కూరేటి భూషయ్య, కట్రపాడు సర్పంచ్ కె.అనంత దుర్గాప్రసాద్, వైస్‌ఎంపిపి షేక్ కాసింబీ, పెదనందిపాడు సర్పంచ్ డి.పద్మారావు, ఎంపిటిసి ఎం.మాలతి, సొసైటీ సెక్రటరీ భాస్కర్, మహేంద్ర పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన విశ్వనాథపల్లి రామచంద్రరావు కుటుంబ పరిస్థితి ఇబ్బందిగా ఉందని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి వచ్చింది. దీంతో సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం ఆ కుటుంబానికి అందజేశారు.

మెడికల్ సీట్లు అమ్ముకోవద్దు

పేద విద్యార్థులకు అన్యాయం చేయొద్దు

ప్రజాశక్తి-తెనాలి

మెడికల్ సీట్లు అమ్ముకుని పేద విద్యార్థులను చదువుకు దూరం చేయొద్దని సిఐటియు జిల్లా నాయకులు కె.బాబు ప్రసాద్ అన్నారు. మెడిసిన్ సీట్లపై నెలకొన్న గందరగోళంపై పట్టణంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాల్గొన్న బాబు ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలు మంజూరు చేరటం హర్షించదగ్గ పరిణామం అన్నారు. అయితే వాటి నిర్వహణ భారం విద్యార్థులపై వేసేందుకు, భారీగా ఫీజులు వసూలు చేసేందుకు ప్రభుత్వం 107, 108 జీవోలను విడుదల చేసింది అన్నారు. మొత్తం ఐదు కళాశాలలో 50 సీట్లను రూ.20 లక్షల చొప్పున, 269 సీట్లను రూ 12 లక్షల చొప్పున ఫీజులు పెంచారన్నారు. దీంతో పేద మధ్య తరగతి వారికి అర్హత ఉన్న మెడిసిన్ సీట్ లభించే పరిస్థితి లేదని, కేవలం బడా బాబుల కోసమే ఈ అవకాశం కల్పించినట్లుగా ఉందని విమర్శించారు. ప్రతిభగల పేద విద్యార్థులకు ఈ పరిణామం శాపమేనన్నారు. పైగా అడ్డు అదుపు లేని విక్రయాలకు యాజమాన్యాలు తెగబడతాయని ఆరోపించారు. ప్రభుత్వం విడుదల చేసిన సంబంధిత 107, 108 జీవోలు రద్దు చేసి, పేద విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఉదయ్ ఈశ్వర్, కూచిపూడి సుభాష్, ఎన్ వినయ్, రవీంద్ర, సతీష్, అనుదీప్, కళ్యాణ్, సురేష్, సందీప్, చిన్న పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరసన ర్యాలీలో బాబు ప్రసాద్

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడేపల్లి: నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణం లోని ప్రకాష్‌నగర్ శ్రీరామ్ మెట్రిక్యులేషన్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఒక్కసారి వీటికి అలవాటైతే మానసికంగా కుంగిపోవడం జరుగుతుందన్నారు. మంచి అలవాట్లు నేర్చుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.సుమ లత, అనూష, జోనల్ కోఆర్డినేటర్ రమేష్, జాకబ్‌బాబు, దేవలక్ష్మి పాల్గొన్నారు.

ఎఎన్‌యులో గద్దర్‌కు నివాళి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకుడు, విప్లవ సాహితీవేత్త గద్దర్ అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయములో సోమవారం పలు విద్యార్థి సంఘాల, పరిశోధక విద్యార్థుల, విద్యార్థినీ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన గద్దర్ సంతాప సభలో ఆయన పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ చిరస్మరణీయ నిస్వార్థ వ్యక్తి గద్దర్ అని, నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చిన్ని నా బొచ్చుకు శ్రీరామరక్ష అన్నట్లుగా కాకుండా సమాజ శ్రేయస్సుకై సాటివారి అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి .వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆచార్య నాగార్జున దూర విద్యాలయ కేంద్ర సంచాలకులు ఆచార్య బి .నాగరాజు, విశ్వవిద్యాలయ కళాశాలల ప్రాచార్యులు, వివిధ విభాగాల ఆచార్యులు విద్యార్థినీ విద్యార్థులు పలు విద్యార్థి సంఘాల నాయకులు కోటి యాదవ్,రాజ్ కుమార్,హర్ష,అభిషేక్,రవి కుమార్ పాల్గొన్నారు.


గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచార్య పి. రాజశేఖర్ తదితరులు

ప్రజాశక్తి-తెనాలి

మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ ఏపి(మాఏపి) ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ప్రజాకవి గద్దర్‌కు సంతాపం ప్రకటించారు. మా ఏపి అధ్యక్షులు దిలీప్‌రాజా ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సమస్యలపై పోరాటానికే గద్దర్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన మరణం తరువాతైనా ఆయనకు పద్మశ్రీ ప్రకటించాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో సినీ నటుడు వేమూరి విజయభాస్కర్, అమీర్‌చౌదరి పాల్గొన్నారు.





నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డు విఆర్ అపార్టుమెంట్, విఎన్‌ఆర్ కెఎన్‌ఆర్ అపార్టుమెంట్ల వద్ద మురుగునీటి ఇబ్బందిపై అపార్టుమెంట్ వాసుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ అపార్టు మెంట్ల నుంచి వస్తున్న మురుగునీరు పోవడానికి సరైన దారి లేక రోడ్లపైకి చేరుతోంది. దీంతో రోడ్డుపై నడవాలంటే మురుగు నీటిలో వెళ్లాల్సి వస్తోంది. లక్షల రూపాయలు వెచ్చించి ప్లాటు కొనుగోలు చేస్తే మురుగునీటి సమస్య ఇబ్బంది పడుతున్నామని అపార్టుమెంట్ వాసులు చెబు తున్నారు. దీనిపై ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటిం చారు. నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ యిచ్చారు. కార్యక్రమంలో డిఇ కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణు గోపాల సోమిరెడ్డి, ఎం.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా సోమవారం పచ్చలు తాడిపరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నాట్కో ట్రస్ట్ కోఆర్డినేటర్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి తల్లి తమ బిడ్డకు ప్రసవించన గంటలోపు పాలు ఇవ్వాలని రెండు సంవత్సరాలు వచ్చే వరకు బిడ్డకు పాలు ఇవ్వవచ్చని అన్నారు. బిడ్డకు ఆరు నెలల నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని అన్నారు ఏఎన్ఎం మాట్లాడుతూ బిడ్డకు రోజుకు 8 నుండి 12 సార్లు పాలు ఇవ్వాలని ప్రశాంతమైన మానసిక స్థితిలో బిడ్డకు పాలు ఆహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ శైలుషా ఆశ వర్కర్ శాంతికే నాట్ కోటర్స్ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది బాలింతలు గర్భిణీలు పాల్గొన్నారు

తల్లిపాలలో విటమిన్ 'ఎ'పుష్కలం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు



తల్లిపాలలో విటమిన్ 'ఎ' పుష్కలంగా ఉంటుందని, ఇది బిడ్డకు చాలా అవసరమని ప్రత్తి పాడు సెక్టార్ సూపర్వైజర్ బి.అరుణ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండల పరిధిలోని కొరియర్‌పాలెంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లులకు,బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లలు చాలా చురుకుగా, తెలివిగా ఉంటారని, శారీరక మానసిక ఎదుగుదల కూడా బాగుంటుందని అన్నారు. తల్లిపాలు తీసుకోని వారు తరచూ జలుబు,దగ్గు మొదలగు వ్యాధుల బారిన పడతారని వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ విజయ, ఏఎన్ఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు

స్ఫూర్తి నింపిన పోరుయాత్ర


గుంటూరు సభలో హింసపై ఇంజినీరింగ్ విద్యార్థుల నృత్యరూపకం







గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సోమవారం పర్యటించిన ఐద్వా పోరుయాత్ర బృందానికి మహిళలు, ఐద్వా నాయకులు పూలు జల్లి డప్పుల దళంతో ఘన స్వాగతం పలికారు. నాయకుల ఉపన్యాసాలు ఆద్యంతం స్ఫూర్తి నింపాయి. హింస పై మహిళల పోరుయాత్రకు యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన కళా ప్రదర్శనలు కళాప్రదర్శనలు ఆలోచింపచేశాయి. బాల్యం నుండి సమాజంలో, కాలేజిలో, పెళ్లయ్యాక కుటుంబంలో మహిళలు ఎదుర్కొనే వివక్షత గురించి నృత్య రూపకం ప్రదర్శంచారు.


చిలకలూరిపేటలో మాట్లాడుతున్న శ్రీనివాసకుమారి


సత్తెనపల్లిలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి




తాడేపల్లి సభలో మాట్లాడుతున్న ఐద్వా గుంటూరు జిల్లా అధ్యక్షులు కె పద్మ


మంగళగిరిలో కళాకారుల గీతాలాపన


పెదకాకానిలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి

ఎఎన్‌యు పేటెంట్లకు జాతీయ స్థాయిలో మూడవ స్థానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు:ప్రముఖ జాతీయ పత్రిక ఇండియా టుడే 2023 సంవత్సరానికి గాను ఉత్తమ విశ్వవిద్యాలయాలపై నిర్వహించిన సర్వేలో పేటెంట్ల విభాగంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని విశ్వవిద్యాలయాలలో గత 3 సంవత్సరాలలో అత్యధికంగా 76 పేటెంట్లను ప్రచురించి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది. కాగా మొదటి స్థానంలో 106 పేటెంట్లతో ఢిల్లీలోని జామియా మిలియా విశ్వవిద్యాలయం, 99 పేటెంట్లతో హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి రెండు స్థానాలలో వరుసగా నిలిచాయి. గడచిన మూడు సంవత్సరాలలో పేటెంట్ల మంజూరులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 16పేటెంట్ల మంజూరుతో తిరిగి జాతీయస్థాయిలో మూడవ స్థానాన్ని నిలబెట్టుకుంది. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్, విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. ప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి .కరుణ హర్షం వ్యక్తం చేశారు. పరిశోధనాత్మక విద్య నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని విశ్వవిద్యాలయ అధ్యయనాలు, పరిశోధనలు సమాజానికి అవసరం అని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలకొరకు వర్సిటీ కృషి చేస్తున్నదని తెలిపారు. విశ్వవిద్యాలయ ఆచార్యుల సమిష్టి కృషితోనే ఇలాంటి విజయాలను సాధించటం జరుగుతున్నదని విశ్వ విద్యాలయ ఆచార్యులను అభినందించారు.

9న విజయవాడలో మహాగర్జన జయప్రదం చేయాలని

గుంటూరులో కార్మిక సంఘాల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు :కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆగస్టు 9న విజయవాడ నగరంలో కార్మిక మహాగర్జన పేరుతో జరుగుతున్న కార్మిక ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం గుంటూరులోని అంబేద్కర్ సెంటర్ నుండి బిఆర్ స్టేడియం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటియుసి గుంటూరు జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఎన్.వి.కష్ణ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలో వచ్చాక కార్మిక చట్టాలు మారుస్తూ కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి చేస్తున్నాడని విమర్శించారు. యజమానులకు అనుకూలంగా చట్టాలు మారుస్తూ కార్మికుల్ని ఆధునిక బానిసలుగా మారుస్తున్నాడని అన్నారు.కార్మికులు ఏకతాటికి వచ్చి, మోడీ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కే శ్రీనివాసరావు ,బి ముత్యాలరావు, ఏఐటియుసి గుంటూరు నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు బందెల రవికుమార్ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

విద్యుత్ ఉద్యోగులపై నిర్బంధం అప్రజాస్వామికం

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగ, కార్మికులపై ప్రభుత్వ నిర్భందం సరైంది కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగ కార్మికులు పిఆర్సీ 45శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని న్యాయమైన డిమాండ్లతో ఆందోళన చేపడితే ప్రభుత్వం వాటిని పరిష్కరించకపోగా ఆందోళనపై పోలీసు నిర్బంధ ప్రయోగిస్తుందని విమర్శించారు. ఒక వైపు ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు మోపుతూ, మరోప్రక్క ఉద్యోగులకు కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు తగ్గిస్తుందన్నారు. విద్యుత్ ఉద్యోగులపై నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇటువంటి చర్యలకు పూనుకుంటే పోరాటాల ద్వారానే వాటిని తిప్పికొడతామన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఒక దొంగను, రౌడీషీటర్‌ను అరెస్టె చేసినట్లు ఉద్యోగులను అరెస్ట్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని

ఇదేనా ఫ్రెండ్లీ ప్రభుత్వం అని ప్రశ్నించారు. ఒక కార్మికుడు ఇంట్లో లేకపోతే అతని తండ్రిని తీసుకొచ్చి స్టేషన్‌లో కూర్చోబెడుతూ అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ ఉద్యోగులు తలుచుకుంటే ప్రభుత్వ వ్యవస్థను స్తంభింప చేస్తారని, ప్రభుత్వ వ్యవహారం కారణంగా సమ్మె బాట పడితే దానికి రాష్ట్ర ప్రభుత్వమే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కట్లకుంట శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు పాల్గొన్నారు.